www.kalamjyothi.com

కలం జ్యోతి

తెలుగు దినపత్రిక

ఆదివారం
27.09.2026





ఉద్యోగులకు లేని ఆరోగ్య భరోసా

- వేతనాల్లో 1.5 శాతం కోతలు
- ఆసుపత్రుల్లో అందని నగదు రహితం
- విధివిధానాలు లేక తీవ్ర గందరగోళం
- ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల మొండిచేయి
- కార్యరూపం దాల్చని సర్కారు హామీలు

ఉద్యోగుల సంక్షేమం కోసమంటూ తెచ్చిన సరికొత్త ఆరోగ్య కార్డుల పథకం క్షేత్రస్థాయిలో గుదిబండగా మారింది. నెలానెలా జీతాల్లో 1.5 శాతం కోతలు విధిస్తున్నా, ఆపద కాలంలో కార్పొరేట్ ఆసుపత్రులు ముఖం చాటేస్తుండటంతో ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. స్పష్టమైన విధివిధానాలు, నెట్‌వర్క్ ఆసుపత్రులతో అధికారిక ఒప్పందాలు లేకపోవడంతో కార్డులున్నా చేతి చమురు వదిలించుకోవాల్సిన దుస్థితిపై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చ, ఆందోళన వ్యక్తమవుతోంది.





కలంజ్యోతి ప్రతినిధి, నిర్మల్ (సెప్టెంబర్ 26) : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కోసం అమలు చేస్తున్న ఆరోగ్య భరోసా పథకం ఆచరణలో విఫలమై తీరని నిరాశను మిగులుస్తోంది. గతంలో ఉద్యోగుల కుటుంబాలకు ఉచితంగా అందిన చికిత్సల స్థానంలో, ఇటీవల ప్రభుత్వం ప్రతి నెలా మూలవేతనం నుంచి 1.5 శాతం మొత్తాన్ని ఈహెచ్ఎస్ నిధికి నేరుగా కట్ చేస్తోంది. మే నెల వేతనం నుంచి మొదలైన ఈ కోతలతో ఉద్యోగుల నుంచి నిధులు సమకూరుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది.

వేతనాల్లో 1.5 శాతం కోతలు..

గతంలో అమలైన ఈహెచ్ఎస్ పథకంలో పేరుకుపోయిన బకాయిలను ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించకపోవడంతో ప్రైవేటు యాజమాన్యాలు క్యాష్‌లెస్‌ను నిలిపివేశాయి. ఈ సమస్యను చక్కదిద్దే క్రమంలో ఉద్యోగుల నుంచి కొంత వాటా తీసుకుని, అంతే సమాన మొత్తాన్ని ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా కలిపి ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా

మిగతా 4లో..



మన్మోహన్ దేశానికే దార్శనికుడు

ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించారు

- తెలంగాణ బిల్లుపై సంతకం చేశారు
- విప్లవాత్మక చట్టాలు తెచ్చిన నేత
- మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి
- హైదరాబాద్ అభివృద్ధికి మూలపురుషుడు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 26) : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశం గర్వించదగ్గ గొప్ప దార్శనికుడు, జాతిరత్నం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. తన అపార మేధస్సును దేశ సేవకే ధారపోసిన నిస్వార్థ నాయకుడని ప్రశంసించారు. పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న కాలంలో ఆర్థిక మంత్రిగా సరళీకృత ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని పెను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆ ఆర్థిక విధానాల వల్లే హైదరాబాద్ నగరంలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఆధునిక కేంద్రాలు ఏర్పడ్డాయని, అందుకే ఆయన సేవలను గౌరవిస్తూ విప్రో సర్కిల్ వద్ద కాంస్య విగ్రహాన్ని నెలకొల్పినట్లు

మిగతా 4లో..



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 27.09.2026
2
www.kalamjyothi.com

విశాఖలో బీజేపీ కీలక భేటీ

పంజాబ్ నుంచి వచ్చిన అంగ్రేసింగ్‌తో సామేలు భేటీ

కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం (సెప్టెంబర్ 26): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్న పరిణామం. జాతీయ స్థాయిలో బీజేపీలో క్రియాశీలకంగా ఉన్న ఇద్దరు కీలక నేతల కలయిక ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.విశాఖపట్నంలోని ఓ ప్రముఖ గెస్ట్ హౌస్ లో పంజాబ్ రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు, జాతీయ నాయకులు అంగ్రేసింగ్ తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ నాయకులు,ప్రజా సేవకులు మద్దిశెట్టి సామేలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఇరువురు నాయకులు ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని, శాలువాతో సత్కరించుకున్నారు. అనంతరం సుమారు గంటకు పైగా వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ప్రధానంగా దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, 2029 ఎన్నికలకు బీజేపీ అనుసరించాల్సిన వ్యూహాలు, దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని మరింత బలోపేతం చేసే అంశంపై వారు ప్రత్యేకంగా దృష్టి సారించారు.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ పార్టీ గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడం, యువతను, విద్యావంతులను పార్టీలోకి తీసుకురావడం, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడం వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

పంజాబ్ నుంచి ప్రతిష్టాత్మక ఆహ్వానం..

ఈ భేటీలోనే మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. వచ్చే నెల 10వ తేదీన పంజాబ్ రాష్ట్రంలోని అమృత్ సర్ లో జరగనున్న జాతీయ స్థాయి అత్యంత ముఖ్యమైన సమావేశానికి మద్దిశెట్టి సామేలు ను ముఖ్య అతిథిగా హాజరుకావాలని పంజాబ్ బీజేపీ నేత అంగ్రేసింగ్ ప్రేమపూర్వకంగా, అధికారికంగా ఆహ్వానించారు.దీనికి మద్దిశెట్టి సామేలు సానుకూలంగా స్పందిస్తూ, తప్పకుండా వస్తానని, పంజాబ్ పర్యటనకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఇది తెలుగు నేతకు దక్కిన పెద్ద గౌరవంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

స్నేహానికి నిదర్శనం..

ఈ భేటీ కేవలం రాజకీయ భేటీ మాత్రమే కాదు, ఇరువురు నాయకుల మధ్య ఏళ్లుగా ఉన్న స్నేహపూర్వక, సోదర భావానికి నిదర్శనంగా నిలిచిందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇలాంటి కలయికలు పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని, జోష్ ను నింపుతాయని వారు అభిప్రాయపడ్డారు.





ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్


కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 26) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అద్భుతమైన తెగువ చూపిన చాకలి ఐలమ్మ ఆశయాలను నేటి తరం అందిపుచ్చుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, అధికారులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర, ఆమె పోరాట పటిమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. నాటి రోజుల్లో రజాకారులు, దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎదిరించి నిలిచిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. వెట్టిచాకిరీ నిర్మూలనతో పాటు అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని సమాజంలో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఐలమ్మ వంటి వీరవనితల చరిత్రను నేటి యువత తెలుసుకోవాలని, వారి స్ఫూర్తిని ప్రజల్లోకి విస్తృతంగా చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, కార్మిక శాఖ అధికారి రాజలింగు, సహాయ బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, రాష్ట్ర మానవ హక్కుల సంఘం ఉపాధ్యక్షురాలు అర్చన, కుల సంఘాల నాయకులు సుంకెట పోశెట్టి, గజ్జారాం, గంగాధర్, మస్కాపురం పోశెట్టి, రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలి



ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముల దిలీప్

కలంజ్యోతి, దుగ్గొండి (సెప్టెంబర్ 26) : వరంగల్ నగర చారిత్రక ప్రాశస్త్యానికి అనుగుణంగా స్థానిక మామూనూరు విమానాశ్రయానికి కాకతీయ వీరనారి రాణి రుద్రమదేవి పేరు నామకరణం చేయాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముల దిలీప్ ప్రభుత్వాన్ని కోరారు. తెలుగు నేల ఆత్మగౌరవాన్ని, పరిపాలనా దక్షతను ప్రపంచానికి చాటిన మహోన్నత పాలకురాలు రాణి రుద్రమదేవి అని ఆయన పేర్కొన్నారు. వరంగల్ గడ్డతో ఆమెకు గల విడదీయరాని అనుబంధాన్ని గౌరవిస్తూ నూతనంగా రూపుదిద్దుకుంటున్న మామూనూరు ఎయిర్‌పోర్టుకు ఆమె పేరు పెట్టడమే సముచితమైన గౌరవమని అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక ఐలమ్మ

కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 26) : తెలంగాణ సమాజంలో సబ్బండ వర్గాల ఆత్మ గౌరవానికి, మహిళా లోకపు చైతన్యానికి చాకలి ఐలమ్మ అసలైన ప్రతీకగా నిలిచారని పలు పార్టీల నాయకులు కొనియాడారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలో శనివారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఐలమ్మ చిత్రపటానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీడిత ప్రజల సంక్షేమం, భూమి హక్కుల సాధన కోసం సాగిన పోరాటంలో ఆమె అగ్రభాగాన నిలిచారని గుర్తుచేశారు. నేటి సమాజం ఆమె తెగువను, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వీరేశం, దౌల్తాబాద్ పటేల్, ఉప సర్పంచ్ శేఖర్ గౌడ్, సంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు బిట్ల మహేష్, గ్రామ పంచాయతీ సభ్యులు అసాజీ శ్రవణ్, హత్నూర మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎండి ఇబ్రహీం, మండల బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు తుమ్మలపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేట జైన మందిరంలో పూజలు

కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 26) : భాద్రపద పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నవాబుపేట గ్రామంలోని జైన మందిరంలో శనివారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో తీర్థంకరుల విగ్రహాలకు శాస్త్రోక్తంగా అభిషేకాలు జరిపిన అనంతరం గ్రామంలో స్వామివారి పల్లకీ సేవను వైభవంగా ఊరేగించారు. ఈ ధార్మిక వేడుకలకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో హత్నూర తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎస్సై శ్రీధర్ రెడ్డి, జైన సమాజ ప్రతినిధులు శివ సత్యనారాయణ, సిద్ధార్థ, కృష్ణమూర్తి, శ్రీనాథ్, నర్సింలు, వీరయ్య, నేమినాథ్, సత్యనారాయణ, మోహన్, శేఖర్, శశికాంత్, విశాల్, రోయింగ్, రాహుల్, సుశీల్, రాహుల్, ఆదిరాజ్, నవాబుపేట గ్రామ సర్పంచ్ బుచ్చయ్య, ఉప సర్పంచ్ బావి, సీనియర్ జర్నలిస్ట్ అన్వర్ హుస్సేన్, గ్రామ పెద్దలు, జైన సోదరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

ఆదివారం 27.09.2026


www.kalamjyothi.com



ప్రజా పోరాటాల స్ఫూర్తి ఐలమ్మ

కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 26) : తెలంగాణ నేలపై భూస్వామ్య దోపిడీపై దండెత్తిన వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాల బాట నేటి తరానికి ఆదర్శమని స్థానిక సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ ఎం. రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో సర్పంచ్ పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ చూపిన తెగువ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకోవడంతో పాటు ఆమె కలలుగన్న సమాజ నిర్మాణం కోసం అందరూ నడుం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, గ్రామ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

పుట్టినరోజున పచ్చదనం పెంపు



కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 26) : జన్మదిన వేడుకలను ఆడంబరాలకు తావులేకుండా పర్యావరణ పరిరక్షణకు వేదికగా మార్చుతూ పాత మగ్గంపురం గ్రామ మాజీ సర్పంచ్ సుంకరి లావణ్య సాంబయ్య దంపతుల కుమారుడు సుంకరి కళ్యాణ్ పుట్టినరోజున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కుటుంబ సభ్యులంతా కలిసి గ్రామంలో పలు మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞబూనారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సుంకరి లావణ్య సాంబయ్య మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ప్రత్యేక రోజుల్లో డబ్బు వృథా చేయకుండా మొక్కలు నాటడం ద్వారా సమాజానికి మేలు చేసినవారవుతామని తెలిపారు. భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడమే మనం ఇచ్చే అసలైన కానుకని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, కాలనీవాసులు, కుటుంబ సభ్యులు పాల్గొని కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశ గడువు పెంపు



కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 26) : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ప్రవేశాల దరఖాస్తు గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ యు. గంగాధర్ ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
దూరవిద్య విధానం ద్వారా ఉద్యోగాలు, ఇతర పనుల్లో ఉన్నవారు కూడా ఉన్నత చదువులు పూర్తి చేసుకునే చక్కటి వెసులుబాటు ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 30వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. కోర్సుల వివరాలు, పూర్తి సమాచారం కోసం 9182568008 నంబరులో గానీ, స్థానిక కళాశాల స్టడీ సెంటర్‌లో గానీ నేరుగా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



పీడిత ప్రజల పోరాట కెరటం ఐలమ్మ

రజక సంఘం మండల అధ్యక్షుడు సంగం రామచంద్రు

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 26) : వెట్టిచాకిరీ, పెత్తందారీ దోపిడీపై పిడికిలెత్తిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల రజక సంఘం అధ్యక్షుడు సంగం రామచంద్రు అధ్యక్షతన జరిగిన ఈ సభకు చెన్నారావుపేట సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి, రజక రిజర్వేషన్ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సంగెం రమేష్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, తిండి కోసం, వెట్టి విముక్తి కోసం రాజీలేని పోరాటం నడిపిన ఐలమ్మ ఆశయాలు నేటి సమాజానికి దిక్సూచి అని పేర్కొన్నారు. నిజాం రజాకార్లు, విసునూరు దేశ్‌ముఖ్ దౌర్జన్యాలను గడగడలాడించిన ఆమె చరిత్రను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. సామాజిక సమానత్వం, రాజ్యాధికారం కోసం బహుజన వర్గాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జయంతి సందర్భంగా ఆసుపత్రుల్లో రోగులకు, స్థానికులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండల ఉపాధ్యక్షుడు ఆరేల్లి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ఉప్పుల వీరస్వామి, డైరెక్టర్లు నార్ల గిరి రవి, చాగంటి రాజు, ఓరుగంటి అశోక్, దూదిగాని రమేష్, కొత్తపల్లి ప్రభాకర్, శ్యామ్, మర్రి రమేష్, గూడెల్లి యాకయ్య, ఉప్పుల భిక్షపతితో పాటు రజక సంఘం నాయకులు, కులబాంధవులు పాల్గొన్నారు.

గురిజాలలో మొబైల్ ఐసీటీసీ శిబిరం




కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 26) : ప్రజల ఆరోగ్య రక్షణ, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించే దిశగా మండలంలోని గురిజాల గ్రామంలో మొబైల్ ఐసీటీసీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. డాక్టర్ సరోజ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రుగ్మతలు, వైరల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు.
ఈ శిబిరంలో స్వచ్ఛందంగా ముందుకొచ్చిన 80 మందికి పైగా గ్రామస్థులకు వైద్య సిబ్బంది హెచ్‌ఐవీ రక్త పరీక్షలు నిర్వహించారు. తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి చైతన్యంతో ముందుకొచ్చిన వారిని వైద్య బృందం ప్రశంసించింది. కార్యక్రమంలో డాక్టర్ సరోజతో పాటు మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ కుమారస్వామి, లింక్ వర్కర్ మంజుల సుభాషిణి, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. శిబిర నిర్వహణకు సహకరించిన స్థానిక ప్రజలకు, వైద్య సిబ్బందికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

అణగారిన వర్గాల గళం ఐలమ్మ

బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి

కలంజ్యోతి, నర్సంపేట (సెప్టెంబర్ 26) : సామాజిక న్యాయం, పేద వర్గాల హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం సాగించిన చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు నేటి తరానికి నిరంతర స్ఫూర్తిదాయకమని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి కొనియాడారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని నర్సంపేట పట్టణంలోని ఆమె విగ్రహానికి బీజేపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ శక్తులపై తిరగబడిన నారీశిరోమణి ఐలమ్మ అని, ఆమె త్యాగనిరతి చిరస్మరణీయమని పేర్కొన్నారు. మహిళల చైతన్యానికి, ఆత్మగౌరవ పోరాటానికి ఆమె నిదర్శనమని గుర్తుచేశారు. ఐలమ్మ ఆశయాల సాధనకు సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ జూలూరు రోజారాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వడ్డేపల్లి నరసింహారాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రామచందర్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు జూలూరు మనీష్ గౌడ్, అబోతు రాజు, సీనియర్ నాయకులు సుంకరి రవీందర్ రెడ్డి, బాల్నే జగన్, పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గంగిడి మహేందర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, మహిళా మోర్చా, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
ఆదివారం 27.09.2026
www.kalamjyothi.com



భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించండి

నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 26) : రెవెన్యూ పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను స్పష్టంగా ఆదేశించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారం, భూముల రీ సర్వే ప్రక్రియ నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూభారతి సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఉన్నతాధికారుల అనుమతి అవసరమైన దరఖాస్తులను క్షేత్రస్థాయి నుంచి తక్షణమే పైస్థాయికి నివేదించాలన్నారు. ప్రతి దరఖాస్తును లోతుగా పరిశీలించి, పారదర్శక విధానంలో నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో అటవీ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సంయుక్తంగా క్షేత్ర సర్వేలు చేపట్టాలని చెప్పారు. గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే పనులను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయికి వెళ్లి పనులను నిరంతరం పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతిరోజూ తమ పరిధిలోని రీ సర్వే ప్రగతిని స్వయంగా సమీక్షించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఖైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, అటవీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన్మోహన్ దేశానికే దార్శనికుడు

▶▶ మొదటిపేజీ తరువాయి



స్పష్టం చేశారు.

తెలంగాణ బిల్లుపై సంతకం..

తెలంగాణ ప్రజల దశాబ్దాల స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేరుస్తూ రాష్ట్ర ఏర్పాటు బిల్లుపై ప్రధాని హోదాలో మన్మోహన్ సింగ్ సంతకం చేసిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ద్వయం తర్వాత దేశంలో అలాంటి మహోన్నత మార్పులు మన్మోహన్ సింగ్, సోనియా గాంధీల నాయకత్వంలోనే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. నేడు భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందంటే దానికి నాడే మన్మోహన్ వేసిన బలమైన ఆర్థిక పునాదులే కారణమని, ఆయన్ను సత్కరించుకోవడం అంటే యావత్ దేశాన్ని గౌరవించుకోవడమేనని తెలిపారు.

విప్లవాత్మక చట్టాలు తెచ్చిన నేత..

గ్రామీణ పేదలకు పని హక్కు కల్పిస్తూ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని చట్టబద్ధం చేసిన ఘనత మన్మోహన్ ప్రభుత్వానిదేనని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశంలో ఆకలి కేకలు ఉండకూడదని ఆహార భద్రత పథకం, ప్రతి బిడ్డకు చదువు అందేలా విద్యా హక్కు చట్టం, పరిపాలనలో పారదర్శకతను పెంచేందుకు సమాచార హక్కు చట్టం వంటి చారిత్రక సంస్కరణలు ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే అమల్లోకి వచ్చాయన్నారు. దేశానికి ఇంతటి విశేష సేవలందించిన మహనీయుడికి ఇప్పటివరకు దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ఇవ్వకపోవడం విచారకరమని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

ఉద్యోగులకు లేని ఆరోగ్య భరోసా

▶▶ మొదటిపేజీ తరువాయి

నడిపిస్తామని ప్రకటించారు. అయితే ఉద్యోగుల నుంచి స్పష్టమైన ఆమోదం తీసుకోకుండానే నేరుగా జీతాల్లో కోతలు విధించడం మొదలుపెట్టారు. తాము చెల్లిస్తున్న మొత్తానికైనా పక్కాగా సేవలు అందుతాయా అంటే అదీ లేకపోవడం ఉద్యోగ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

ఆసుపత్రుల్లో అందని నగదు రహితం..

నెట్‌వర్క్ ఆసుపత్రులతో అధికారికంగా పరస్పర ఒప్పందాలు (ఎంవోయూ) పూర్తి చేసుకోకుండా, పక్కా విధివిధానాలు ఖరారు చేయకుండానే డిజిటల్ కార్డులు జారీ చేయడంతో పథకం మొదటికే మోసం వచ్చింది. అత్యవసర వేళల్లో ఆసుపత్రులకు వెళ్లిన ఉద్యోగులకు చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. వైద్య చికిత్స కోసం వెళ్లిన ఉద్యోగిని చేర్చుకునేందుకు ప్రైవేటు యాజమాన్యాలు నిరాకరిస్తూ ముందస్తు డిపాజిట్లను డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల విద్యుత్ షాక్‌కు గురైన ఒక ఉద్యోగి కుమారుడికి ఆరోగ్య కార్డు ద్వారా అత్యవసర చికిత్స చేసేందుకు ప్రైవేటు ఆసుపత్రి నిరాకరించడంతో, అప్పులు చేసి లక్షల రూపాయలు చెల్లించినా బాలుడి ప్రాణం దక్కని విషాద ఘటన చోటుచేసుకుంది.

విధివిధానాలు లేక తీవ్ర గందరగోళం..

ఆరోగ్య కార్డుల సమస్యలపై విమర్శలు వెల్లువెత్తి నప్పుడల్లా యంత్రాంగం కొన్ని ఆసుపత్రులపై ఒత్తిడి తెచ్చి చికిత్సలకు ఒప్పించే తాత్కాలిక ప్రయత్నాలు చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ప్యాకేజీ ధరలు గిట్టుబాటు కావడం లేదంటూ యాజమాన్యాలు చికిత్సలకు అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్నాయి. సీజీహెచ్ఎస్ ప్యాకేజీలు వర్తిస్తాయని అధికారులు చెబుతున్నా, సాధారణ వార్డు బెడ్ల కేటాయింపు మొదలు అత్యవసర శస్త్రచికిత్సల దాకా రోగుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. తమ వేతనం నుంచి క్రమం తప్పకుండా కోత చెల్లిస్తున్నా, చేతి చమురు వదిలించుకోవాల్సి రావడం ఉద్యోగులను తీవ్ర క్షోభకు గురిచేస్తోంది.

ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల మొండిచేయి..

ఉద్యోగుల నుంచి వసూలు చేస్తున్న కోతకు సమానంగా ప్రభుత్వం తన వాటాను సకాలంలో జమ చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మే మాసంలో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పది రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరించి సమగ్ర మార్గదర్శకాలు తెస్తామని ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఉద్యోగుల అసంతృప్తి తీవ్రమైన ప్రతిసారీ యంత్రాంగం కంటితుడుపు వివరణలతో కాలయాపన చేస్తోంది. ఇప్పటికైనా కార్పొరేట్ ఆసుపత్రులతో అధికారికంగా ఒప్పందాలు కుదుర్చుకుని, ఎలాంటి షరతులు లేకుండా వంద శాతం నగదు రహిత వైద్య సేవలను అందుబాటులోకి తేవాలని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి.



పర్యాటక రంగంలో సరికొత్త సాంకేతికత

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 26) : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలను శనివారం ఘనంగా నిర్వహించారు. డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం అనే ప్రధానాంశంపై చేపట్టిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యాటక రంగంలో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంతో వస్తున్న సమూల మార్పులు, సరికొత్త అవకాశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచడంతో పాటు వారిలోని సృజనాత్మకతను వెలికితీయడమే ఈ పోటీల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం అంశాల్లో తమ ప్రతిభను చాటారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా టూరిజం నోడల్ అధికారి శ్రీకాంత్ రెడ్డి హాజరై విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు పాఠశాల చదువులతో పాటు పర్యాటకం, ఆధునిక సాంకేతికత, సృజనాత్మక రంగాలపై పట్టు సాధించాలని అధికారులు సూచించారు.

నేడు బీసీ, ఎస్సీ, ఎస్టీ

బహిరంగ సభ



కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 26) : జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం, సంక్షేమ ఫలాలు దక్కాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 27న నిర్వహించతలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల కన్వీనర్ అలువాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సభ విజయవంతం కోసం జేఏసీ బృందం శనివారం మండలంలోని వివిధ కుల సంఘాల నాయకులను, సర్పంచులను నేరుగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేసింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సబ్బండ వర్గాలకు తగిన వాటా దక్కాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. ఎవరి సంఖ్య ఎంత ఉంటే వారికి అంత వాటా దక్కాలన్న అంశంపై ప్రజల్లో లోతైన అవగాహన కల్పించేందుకే ఈ వేదికను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, పలువురు ప్రొఫెసర్లు, సామాజిక విశ్లేషకులు ప్రసంగించనున్నారు. పార్టీలకు అతీతంగా మేధావులు, న్యాయవాదులు, విద్యార్థులు, మహిళా లోకం, ప్రజాస్వామికవాదులు ఈ మహాసభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జేఏసీ ప్రతినిధులు కోరారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

పాత్రల ఎంపికపై కాయదుకు ట్రోల్స్

సరైన విజయాల కోసం ఎదురుచూస్తున్న యువ కథానాయిక కాయదు లోహార్ పాత్రల ఎంపిక తీరుపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర స్థాయిలో ట్రోల్స్ వస్తున్నాయి. కన్నడ చిత్రం ముగిల్ పేటతో తెరంగేట్రం చేసి, అల్లూరి సినిమాతో టాలీవుడ్‌లోకి ప్రవేశించిన ఈమెకు అవకాశాలు వస్తున్నా సరైన హిట్టు దక్కడం లేదు. ఇటీవల విడుదలైన నాని చిత్రం ది ప్యారడైజ్‌పై భారీగా ఆశలు పెట్టుకున్నప్పటికీ, అందులో ఆమె చేసిన పాత్ర ప్రేక్షకుల్లో అసహనాన్ని కలిగించడంతో నెగెటివిటీని మూటగట్టుకుంది. ఇప్పటికైనా కథలు, పాత్రల ఎంపికపై దృష్టి పెట్టకపోతే టాలీవుడ్‌లో కెరీర్ కష్టమేనని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.